క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు అర్హత



సత్తా చాటిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

కనగానపల్లి: స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ మాధవ రాజులు తెలిపారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన రేఖ, రేణుక అనే విద్యార్థినులు సత్తా చాటినట్లు పేర్కొన్నారు. ఇందులో మెరుగైన ప్రతిభ కనబరిచిన వీరిద్దరిని ఈనెల 5వ తేదీ నుంచి నరసరావుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రవికిరణ్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా విద్యార్థినులను అభినందించారు.

మీ సేవలు వెలకట్టలేనివి



పదవీ విరమణ పొందిన సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: సుదీర్ఘ కాలంలో పోలీస్‌శాఖలో మీరు అందించిన సేవలు వెలకట్టలేనవని ఎస్పీ రత్న కొనియాడారు. పెనుకొండ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కాశీం గురువారం పదవీ విరమణ పొందారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ సిబ్బంది ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకిత భావంతో, చిత్తశుద్ధితో పోలీస్‌శాఖ ద్వారా ప్రజల విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సేవలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయ కుమార్, ఏఓ సుజాత, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యం, ఆర్ఐలు వలీ, మహేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

త్రిలింగ దర్శనానికి ప్రత్యేక సర్వీసులు

పుట్టపర్తి టౌన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని బుగ్గరామలింగేశ్వరస్వామి, యాగంటి, మహానంది దేవాలయాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పుట్టపర్తి డిపో మేనేజర్ ఇనయతుల్లా పేర్కొన్నారు. కార్తీక మాసం సందర్భంగా తాడిపత్రి వద్ద ఉన్న బుగ్గ రామలింగేశ్వరాలయం, బనగానిపల్లి వద్ద ఉన్న యాగంటి, నంద్యాల వద్ద ఉన్న మహానంది శైవ క్షేత్రాల త్రిలింగ దర్శనం కోసం 4, 11, 18, 25 తేదీల్లో ప్రతి సోమవారం పుట్టపర్తి డిపో నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరి, తిరిగి సాయంత్రానికి వచ్చే విధంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సర్వీసులు పెంచుతామన్నారు. అలాగే అరుణాచలంలో తిరువణ్ణామలై గిరి ప్రదక్షణకు కూడా 3,10,17,24వ తేదీల్లో రాత్రి 7 గంటలకు ప్రత్యేక సర్వీసు పుట్టపర్తి బస్టాండ్ నుంచి బయలుదేరుతుందన్నారు. భక్తులు ముందుగా ఆన్‌లైన్ ద్వారా టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9959225857, 9440201270 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.


రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



శబరీష్‌గౌడ్‌తో హెచ్‌ఎం సుజాత

ధర్మవరం అర్బన్: జీవనజ్యోతి పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుజాత తెలిపారు. ఇటీవల అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీల్లో శబరీష్ గౌడ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి అండర్–17 రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని పీడీ వలి తెలిపారు.

అన్నీతామై అంత్యక్రియలు



మృతదేహాన్ని తీసుకెళ్తున్న ఖిద్మత్–ఎ–ఖల్క్ ట్రస్ట్ సభ్యులు


పుట్టపర్తి టౌన్: జర్మనీకి చెందిన బార్బరన్ కోహెన్ (80) సత్యసాయి భక్తురాలుగా పుట్టపర్తికి చేరుకొని కొద్ది సంవత్సరాలుగా పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధి బ్రాహ్మణపల్లి నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. స్వంత వారు ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఖిద్మత్– ఎ–ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు సమాచారమిచ్చారు. కమిటీ సభ్యులు షామీర్, ఆలీ, మాతంగి సాయి, ఆదిల్, సల్మాన్, ఫైజల్ అన్నీతామై పుట్టపర్తి పట్టణంలో కర్ణాటకనాగేపల్లి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

పవిత్రం.. కార్తీకం

- ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ
- నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం



బత్తలపల్లిలో పూజలందుకుంటున్న శివుడు



సంజీవపురం వద్ద ఉన్న కాటికోటేశ్వర క్షేత్రం

బత్తలపల్లి: కార్తీక మాసం శివ, విష్ణువులకు ప్రీతికరమైంది. దీంతో భక్తులు శివాలయాల్లో అభిషేకాలు, పూజలే కాక విష్ణు ప్రీతిగా తులసి పూజలు చేస్తారు. అయ్యప్ప దీక్ష కూడా శనివారం నుంచి వచ్చే కార్తీక మాసంలోనే ఆరంభమవుతుంది. నెల రోజులూ పర్వదినాలుగా గడుస్తాయి. బత్తలపల్లి మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన సంగమేశ్వర, కాటికోటేశ్వర క్షేత్రంతో పాటు మండల కేంద్రంలోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వర దేవాలయంలోనూ, పోట్లమర్రి, ముష్టూరులోని శివాలయాలు, గంటాపురం అప్పస్వామి, దంపెట్ల చెన్నకేశవాలయం, డి.చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం, గుమ్మల్లకుంట లక్ష్మీనరసింహాస్వామి దేవాలయాల్లో కార్తీక పూజలకు ఏర్పాట్లు చేశారు. తాడిమర్రి మండలంలోని ఏకపాదంపల్లిలో లక్ష్మీనరసింహాస్వామి ఆలయం, చిల్లవారిపల్లి కాటికోటేశ్వర క్షేత్రం, కునుకుంట్ల, తాడిమర్రి, చిల్లకొండయ్యపల్లి, దాడితోట శివాలయాల్లో కార్తీక పూజలకు భక్తులు పోటెత్తనున్నారు.

శివుడు పరవశించిపోతాడు



కార్తీక మాసంలో భక్తులు చేసే పూజలు, అభిషేకాలకు పరమశివుడు పరవశించిపోతాడు. భక్తులు ఆచరించే నియమ నిబంధనల్లో కచ్చితత్వం పాటించి దీపారాధన చేస్తే అజ్ఞానం తొలగి జ్ఞానాన్ని పొందవచ్చు. సాలగ్రామ దానం, గోదానం, స్వయంపాక దానం, సత్యనారాయణ వ్రతం, కేదారేశ్వర వ్రతంతో పాటు రుద్రాభిషేకం, మహాలింగార్చన చేస్తే చాలా మంచి ఫలిత పుణ్యాన్ని పొందవచ్చు.

– పార్థంది చంద్రశేఖర్‌శర్మ, వేదపండితులు, ఈదుల ముష్టూరు

పవిత్రమైన మాసం



కార్తీక మాసానికి పురాణాల్లో సైతం ఎంతో పవిత్రత ఉంది. శివునికి ప్రీతిపాత్రమైన మాసం కార్తీక మాసం. మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి. కార్తీక మాసంలో శివుని ఆరాధిస్తే కోరిన కోర్కెలు తీర్చడంతో పాటు మాంగళ్య బలం పెరుగుతుందని నమ్మకం. మహిళలు శివాలయాలకు వెళ్లి దీపాలు వెలిగించవచ్చు. – ధనుంజయశర్మ, వేదపండితులు, ఈదుల ముష్టూరు

మానవీయ విలువలే చక్కటి ఆభరణాలు



నృత్యరూపకంలోని సన్నివేశం

ప్రశాంతి నిలయం: మానవీయ విలువలను పాటించినప్పుడే మానవ జీవితం ఆనందమయమవుతుందని, నైతిక విలువలతో కూడిన జీవనమే మనిషికి చక్కటి ఆభరణాలంటూ 'డివైన్ పాథ్ ఆఫ్ క్యారెక్టర్' పేరుతో సూరత్‌కు చెందిన సత్యసాయి బాలవికాస్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. గుజరాత్ నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని రెండో రోజు ప్రశాంతి నిలయంలో శుక్రవారం సాయంత్రం బాలవికాస్ చిన్నారులు నృత్య రూపకం ప్రదర్శించారు. సత్యసాయి ప్రబోధించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమలనే విలువలు మానవ జీవితాన్ని ఆహ్లాదమయం చేస్తాయని వివరించారు. అనంతరం గుజరాత్‌లోని వడోదరాకు చెందిన మహిళా భక్తులు సంగీత కచేరి నిర్వహించారు.

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలోని శివానగర్‌లో జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు మణికంఠ శుక్రవారం భార్య శ్రీలక్ష్మితో ఇంటి విషయంలో గొడవపడ్డాడు. శివానగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద విష ద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడ్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బత్తలపల్లిని కరువు మండలంగా ప్రకటించాలి

బత్తలపల్లి: కరువుతో అల్లాడుతున్న బత్తలపల్లిని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం ధర్మవరంలో ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, మండల రైతు సంఘం అధ్యక్షులు సత్యప్ప, పలువురు రైతులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అకాల వర్షాల వల్ల కంది, వేరుశనగ, మిర్చి, టమాట, ఆముదం, దానిమ్మ, బొప్పాయి మొదలైన పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు అన్ని నష్టపోయినట్లు వివరించారు. జిల్లాలో కరువు మండలాల జాబితాలో బత్తలపల్లి లేకపోవడం విచారకరమన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా స్మశాన వాటికకు స్థలం లేకుండా పోతుందన్నారు. శవాలను పూడ్చాలంటే ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్‌కు, జాయింట్ కలెక్టర్‌కు, ఆర్డీఓకు, తహసీల్దార్‌కు వినతి పత్రాలను బత్తలపల్లి ప్రజల తరుపున అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బీదాల నారాయణస్వామి, రాందాసు, మారెక్క, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లులో ఆందోళన..

తనకల్లు: తనకల్లును కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం, కాంగ్రెస్, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ మండలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం అడుగడుగునా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలు ఇప్పటి వరకూ అమలు చేయకపోవడం దారుణమన్నారు. అనంతరం తహసీల్దార్ శోభ సువర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తోపు పారేసు, శివన్న, వేమన్న, రైతు సంఘం నాయకులు రమణ, వెంకటరమణ, ఎమ్మార్పీస్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్ఐలు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో పనిచేస్తున్న 1990వ బ్యాచ్‌కు ఏడు మంది ఏఎస్ఐలకు ఎస్ఐలుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. శుక్రవారం పోలీస్ కార్యాలయంలో తన చాంబర్‌లో ఎస్పీ రత్నను వారు మర్యాద పూర్వకంగా కలసి పూల బొకే అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు –పుట్టపర్తి రహదారిలో ప్రశాంతి రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే... పుట్టపర్తి మండలం రాచువారిపల్లి, వెంకటగారిపల్లికి చెందిన సాయినాథ్, మధు, మనోహర్, చంద్ర వస్తుండగా.. వెంటకరాముడు కొత్తచెరువు నుంచి పుట్టపర్తికి వస్తున్నారు. రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టుకొవడంతో ఐదుగురు గాయపడగా ఆస్పత్రికి తరలించారు.

స్పోర్ట్స్ మెటీరియల్ వితరణ

బత్తలపల్లి: రామాపురం గ్రామానికి చెందిన పూర్వపు విద్యార్థి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రవీణ్ కుమార్ తాను చదువుకున్న రామాపురం ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ మెటీరియల్, 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సంబంధించిన మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న శానిటరీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ కోరారు. శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్‌కు శానిటేషన్ వర్కర్లు, కంటింజెంట్స్ ఆయాలతో కలిసి వినతిపత్రం అందించారు. కనీస వేతనం అమలు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సీఐటీయూ కో–కన్వీనర్ ఆదినారాయణ, నాయకురాళ్లు చౌడమ్మ, జయమ్మ, ముంతాజ్, లక్ష్మీదేవి, పర్వీనా, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

తాడిమర్రి: మండల కేంద్రంలో శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ అరుణ పతాకాన్ని ఎగురవేశారు. రైతులు, కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటాలు చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కాటమయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పరామర్శ



మాధవప్ప చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. పైపల్లిలో ఇటీవల కురుబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మాధవప్ప మృతి చెందారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాచువారిపల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన వెంకప్పనాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసారెడ్డి, నాయకులు గంగాద్రి, సతీష్‌రెడ్డి, రాజారెడ్డి, మహేశ్వరరెడ్డి, సంజిరెడ్డి, పాల గోవిందు, చంద్రమోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

కనగానపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్.రామచంద్రారెడ్డి (53) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని పర్వతదేవరపల్లి గ్రామానికి చెందిన మృతుడు రామచంద్రారెడ్డి గత శనివారం ద్విచక్ర వాహనంలో వస్తూ మరూరు టోల్ గేట్ వద్ద ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడిని బెంగుళూరులో ఒక ప్రవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ మారుతిప్రసాద్ పలువురు రామచంద్రారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. గంగుల సుధీర్‌రెడ్డి, నాగముని, ఎంపీటీసీ క్రిష్టారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రామలింగారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

యువతి మృతి

తనకల్లు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మౌనిక (21) అనే యువతి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వివరాలు...మండలంలోని రాకుంటపల్లి వద్ద గత నెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో మౌనిక తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆమెను కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

కదిరి టౌన్: స్థానిక కోర్టు ఆవరణంలో డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.జయలక్ష్మి తెలిపారు. జాతీయ న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం పోలీసులతో సమావేశం నిర్వహించారు. కోర్టు ఇన్‌చార్జ్ రాకేష్, సీఐలు నారాయణరెడ్డి, నాగేంద్ర, ఎస్ఐలు గోపి, మక్బూల్ దాదా, న్యాయవాదులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌కు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న చక్రపాణి

బత్తలపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న చక్రపాణి ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డారు. ధర్మవరం శ్మశానవాటిక వద్ద కుక్కలు అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం నుంచి కిందపడ్డారు. స్థానికులు అతడ్ని పట్టణంలోని ప్రవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, అధికారులు చక్రపాణిని పరామర్శించారు.

'అవినీతిని నిర్మూలించాలి'



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం: మున్సిపాలిటీ అవినీతికి కేరాఫ్‌గా మారింది. టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సొంత లాభం చూసుకుని లంచాలు దండుకుంటున్నారు. మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మంత్రి సత్యకుమార్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 37వ వార్డు కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారులు ప్లాన్ అప్రూవల్స్ విషయంలో లంచాలు దండుకుని నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చి లంచాలు దండుకుంటున్నారన్నారు. వీరి వ్యవహారం పలు వార్త పత్రికల్లో ప్రచురితమైందన్నారు. అవినీతిని నిర్మూలించి మున్సిపాలిటి ఆదాయాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. 9వ వార్డు కౌన్సిలర్ మాసపల్లి సాయికుమార్ మాట్లాడుతూ.. చిన్నూరు వార్డు మున్సిపాలిటి పరిధిలో ఉన్నప్పటికి చెరువు మరువ పారుతుండటంతో వంక మీదుగా ఉన్న రోడ్డు దాటే పరిస్థితి లేదన్నారు. గతంలో వంక దాటుతూ ఒక వ్యక్తి మరణించడం జరిగిందన్నారు. చిన్నూరు వంక వద్ద బ్రిడ్జిని నిర్మించాలన్నారు. జోగోనికుంట వద్ద డ్రైనేజీ పోవడంతో మగ్గం గుంతల్లో నీటి ఊట కారణంగా చేనేతలు ఇబ్బందులు పడుతున్నారని 24వ వార్డు కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తంరెడ్డి తెలిపారు. 11వ వార్డు కౌన్సిలర్ పెణుజూరు నాగరాజు మాట్లాడుతూ.. వార్డులో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి హయాంలో నిర్మించిన కాయగూరల మార్కెట్ మూడవ అంతస్తులో అద్దె గదులు ఖాళీగా ఉన్నాయన్నారు. మున్సిపాలిటికి ఆదాయం రావడం లేదని పేర్కొన్నారు.

పట్టణాన్ని అభివృద్ధి చేద్దాం

రాజకీయ విభేదాలను పక్కన పెట్టి సమష్టిగా మున్సిపాలిటీని అభివృద్ధి చేద్దామని మంత్రి సత్యకుమార్ పిలుపునిచ్చారు. అవినీతి నిర్మూలనకు చర్యలు చేపడతామన్నారు. మల్లేనిపల్లి డంప్‌యార్డుకు శాశ్వత రోడ్డు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ఎంతోకాలంగా వేధిస్తున్న హిందూశ్మశాన వాటిక కోసం స్థల సేకరణ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ అధికారి సాయిప్రసాద్, మెప్మా టీపీఓ విజయ్‌భాస్కర్ రాయల్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్యాంసన్, కేశవ, 40 వార్డుల కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్లు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో శుక్రవారం రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 21వ తేదీన అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. అండర్–14 విభాగంలో పాల్గొనే ఉమ్మడి అనంతపురం బాస్కెట్‌బాల్ బాల బాలికల జట్లలో బాలికల విభాగంలో పట్టణానికి చెందిన బి.యశస్విత, బాలుర విభాగంలో బి.శశిధర్ కుమార్ ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 2వ తేది నుంచి 4వ తేదీ వరకు పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో జరిగే 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చూపి ధర్మవరానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్ హర్షం వ్యక్తం చేశారు.

సంక్షిప్త సమాచారం

రేగాటిపల్లి చెరువుకు జలహారతి

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని రేగాటిపల్లి చెరువులో శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ గంగపూజ చేసి జలహారతి ఇచ్చారు. ఇటీవల అల్పపీడనం కారణంగా చెరువు నిండి మరువ పారింది. ఈ నేపథ్యంలో జనసేన నాయకులు మధుసూధన్‌రెడ్డితో కలిసి గంగపూజ చేశారు. అదే విధంగా రేగాటిపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.

10న వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ

కదిరి టౌన్: ఈనెల 10న పట్టణంలో వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ ఉంటుందని శ్రీఖాద్రీ వడ్డెర్ల సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జె.వి రమణ, గంగయ్య, రమణ, సంపంగి గోవర్ధన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూకు కృతజ్ఞతలు

కదిరి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ సాధనకు అసోసియేషన్ కృషి మరువలేదని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిమోహన్ శుక్రవారం తెలిపారు. సర్వీసులో ఉండి పెన్షన అర్హత సాధించిన డ్రైవర్ నారపరెడ్డికి కదిరి డిపోలోనే మొదటి వ్యక్తిగా అత్యధిక పెన్షన్ రూ.16,506 పెన్షర్ ఆర్డర్ ఉత్తర్వులు అందుకున్నారన్నారు. గతంలో కేవలం రూ. 2 వేలు, 3 వేలు మాత్రమే ఆర్టీసీలో పెన్షన్ వచ్చేదన్నారు. కదిరి డిపోలో 10 మంది అత్యధిక పెన్షన్‌కు అర్హత సాధించారన్నారు. అత్యధిక పెన్షన్ మంజూరుకు కృషి చేసిన ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావుకు పెన్షనర్లు కృతజ్ఞతలు తెలిపారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

తనకల్లు: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో యూటీఎఫ్ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఖాజామోహిద్దీన్, ప్రధాన కార్యదర్శిగా గణేష్, గౌరవాధ్యక్షుడిగా రాజారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కే.గౌసియా, వెంకటశివరామకృష్ణ, కోశాధికారిగా మహమ్మద్ షరీఫ్ ఎన్నికయ్యారు. అలాగే జిల్లా కౌన్సిలర్లుగా సంతోష్‌కుమార్, బాబ్‌జాన్, శివశంకర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాసులు, వైవీ సుబ్బారెడ్డి, ఆజాంబాషా పాల్గొన్నారు.

సన్మానం

నల్లచెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన రమాదేవిని శుక్రవారం హెచ్‌ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం కృష్ణాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు సంతోష్‌కుమార్, దుర్గా రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బాలాజీ తెలిపారు. వారిని హెచ్‌ఎం బాలాజీ , పీడీ చిన్నప్పయ్య, సిబ్బంది అభినందనలు తెలిపారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

పుట్టపర్తి: విద్యతోనే ప్రతి వ్యక్తికి సమాజంలో గుర్తింపు సాధ్యమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. ఆమె మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులతో కలిసి శుక్రవారం బుక్కపట్నం డైట్ కళాశాలను సందర్శించారు. డైట్ ప్రిన్సిపాల్ రవిసాగర్, వ్యాయామ అధ్యాపకుడు రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు పింఛన్ పంపిణీలో పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి సమక్షంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి పావని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే ఆర్డీఓ మహేష్ తదితరులు పటేల్ చిత్రపటానికి పూలమాల వేశారు.

ఇందిరా గాంధీకి నివాళి

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కోటా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

కదిరి టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కదిరప్ప ఆధ్వర్యంలో పట్టణంలోని ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం



తలుపుల: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసిన ప్రజా సంఘాల నాయకులు

కదిరి అర్బన్: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం టవర్‌క్లాక్ వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి కదిరి ఆర్యవైశ్యసంఘాల నాయకులు, తదితరులు నివాళులు అర్పించారు.

తలుపుల: స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పొట్టి శ్రీరాములు చిత్రపటాన్ని ఉంచి పూలమాల వేసి ప్రజా సంఘాల నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎద్దుల రాముడు, ఈశ్వరయ్య, ఆదినారాయణ, కిట్టు, గంగప్ప, రమణ, సుబ్బయ్య, మహేశ్ పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: మహనీయుల త్యాగాలను గుర్తించి వారి అడుగుజాడల్లో నడవాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జూటూరు రమణయ్య తెలిపారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక కాలేజీ సర్కిల్‌లోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి శుక్రవారం ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్‌గుప్త, కార్యదర్శి తబ్జుల్ శ్రీనివాసులు, కోశాధికారి పిన్ను అశోక్ కుమార్, వాసవీ దేవాలయ కమిటీ చైర్మన్ పిన్ను ప్రసాద్, మాజీ కౌన్సిలర్ అంబటి బద్రీనాథ్, పీఆర్‌ఓ గ్రంధే శ్రీనివాసులు, సభ్యులు రాజాగోవిందు, రమేష్‌బాబు, రేపాకుల రాజశేఖర్, లక్ష్మీనారాయణ, కార్తీక్, ప్రసాద్ పాల్గొన్నారు.

పుట్టపర్తి: రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని ఆర్యవైశ్యం సంఘం నాయకులు ప్రశాంత్, నాగభూషణ అన్నారు. శుక్రవారం సత్యసాయి డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న శ్రీరాములు విగ్రహం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు.

ఘనంగా దీపావళి



ఎన్‌పీకుంటలో చిచ్చుబుడ్లు వెలిగిస్తున్న చిన్నారులు

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో గురువారం దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు దీపాలతో ఇళ్లను సుందరంగా అలంకరించారు. చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా టపాసులు కాలుస్తూ సందడి చేశారు.

– సాక్షినెట్‌వర్క్:

టెట్రా ప్యాకెట్ల పట్టివేత

ముదిగుబ్బ: మండలంలోని యాకర్లకుంటపల్లికి చెందిన నారాయణ స్వామి నుంచి 96 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్యామ్‌రావు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. వాహనాన్ని సీజ్ చేయడం జరిగిందన్నారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ అశోక్, కానిస్టేబుళ్లు చలపతి, జనార్దన్ నాయుడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.